సాక్షి జోగులాంబ గద్వాల

బుధవారం । 17 । జూలై । 2024



..తొలి ఏకాదశి

తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸



విద్యుదుత్పత్తి ప్రారంభం

శ్రీశైలం జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.2 /22.1

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతి ఏజెంట్ కష్టపడి పనిచేస్తేనే ఫలితం



గద్వాల: ఎల్ఐసీ ఏజెంట్ల గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ.50 వేల నుంచి రూ.15 లక్షల వరకు తీసుకొచ్చిన ఘనత లీయాఫీ (లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)దేనని ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ శ్రీనివాసచారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎల్ఐసీ ఏజెంట్ల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏజెంటు కష్టపడి పనిచేస్తేనే ఫలితం ఉంటుందన్నారు. లియాఫీలో సంవత్సరానికి రూ.500 కడితే రూ.25 వేల ఇన్సూరెన్స్ ఉంటుందని చెప్పారు. ఇది కేవలం లియాఫీలో సభ్యత్వం తీసుకున్న వారికి మాత్రమే ఉంటుందన్నారు. ఇలాంటి ప్రయోజనం ఎక్కడా లేదని, ఒక లియాఫీ సంస్థలోనే ఉందని వివరించారు. సమావేశంలో లియాఫీ నాయకులు మల్లికార్జున్‌గౌడ్, రజాక్, బాబాఉస్మాన్ అలీ, మురళీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, పెద్ద ఇస్మాయిల్, రాఘవగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓపై ఎస్సీ, ఎస్టీ కేసు

మానవపాడు: మండల కేంద్రంలోని ఓ అధికారి యువకుడిని కులం పేరుతో దూషించినందుకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అమరవాయి గ్రామపంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్‌ని గ్రామస్తుల ప్రమేయంతో తొలగించారు. కంప్యూటర్ ఆపరేటర్‌ను కొత్తగా నియమించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డిని అమరవాయికి చెందిన హరిజన ప్రదీప్ కొన్ని రోజుల కిందట కోరాడు. రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకోవడం లేదని మంగళవారం 3 గంటల ప్రాంతంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హరిజన ప్రదీప్, గణేష్, ప్రవీణ్ మరికొంత మంది అమరవాయి గ్రామస్తులు కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓ ని కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. మీరెంతా మీ బతుకెంతా.. నేను మీకు సమాధానం చెప్పాలా..! అని ఎంపీడీఓ కులం పేరుతో దూషించాడని హరిజన ప్రదీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలియజేశారు.

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు ఎన్నికలు నిర్వహించాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, శ్రీశైలం దేవస్థాన ఆర్యవైశ్య ట్రస్టు చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్ కోరారు. జిల్లాకేంద్రంలోని ఆర్యవైశ్య బాలుర హాస్టల్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్యవైశ్య మహాసభ బైలా ప్రకారం ప్రతి రెండేళ్లకు ఎన్నికలు నిర్వహించాలని ఉందని, కానీ తొమ్మిదేళ్లుగా ఒకే వ్యక్తి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా ఉప్పల్ బాగాయత్‌లో ఆర్యవైశ్య మహాసభకు కేటాయించిన ఐదు ఎకరాల స్థలానికి సంబంధించి అభివృద్ధి బాధ్యతలు పూర్తిగా మహాసభకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ట్రస్టుకు అప్పగిస్తే పేద ఆర్యవైశ్య బిడ్డలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద ఆర్యవైశ్య బిడ్డలకు న్యాయం జరగాలంటే ఐదు ఎకరాల స్థలం అభివృద్ధికి సంబంధించి మహాసభకు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల అధ్యక్షులు పాలాది రామ్మోహన్, బచ్చు రామకృష్ణ, శంకు ఉమేష్, కల్వ రాజు, బాలస్వామి, మలిపెద్ది శంకర్ పాల్గొన్నారు.

వందేభారత్ రైలు వేళల్లో మార్పు

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే యశ్వంత్‌పూర్– కాచిగూడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వేళల్లో మార్పు చేసినట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. వందేభారత్ రైలు మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు గతంలో రాత్రి 9.04 గంటలకు వచ్చి 9.05 గంటలకు వెళ్తుండగా.. ఈనెల 18 నుంచి రాత్రి 9.26 గంటలకు వచ్చి 9.27 గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు.

మొదలైన ప్రక్షాళన

ప్రభుత్వ ఆస్పత్రిపై 'సాక్షి' వరుస కథనాలపై స్పందించిన కలెక్టర్ బీఎం సంతోష్

- విధులపై నిర్లక్ష్యం వహించిన సూపరింటెండెంట్‌పై వేటు
- మరో 16 మంది వైద్యులకు నోటీసులు
- అక్రమాలకు పాల్పడిన ఫార్మసిస్టుపై సస్పెన్షన్
- అనధికారికంగా నియామకాలు చేపట్టిన గత సూపరింటెండెంట్ వ్యవహారంపై విచారణ
- హడలెత్తిపోతున్న వైద్యులు



ఆస్పత్రి ల్యాబ్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్(ఫైల్)

గద్వాల రూరల్: జిల్లాలో పేదలకు పెద్దదిక్కుగా ఉంటూ.. వైద్యసేవలందిస్తున్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కొందరు వైద్యుల నిర్వాకంతో మసకబారింది. ముఖ్యంగా గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించే సూపరింటెండెంట్ వ్యవహారశైలి వివాదాస్పదమైంది. సూపరింటెండెంట్‌ను ఆదర్శంగా తీసుకున్న మరికొందరు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. రోగులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. దీనిపై 'సాక్షి'దినపత్రికలో వరుస కథనాలతో వెలుగులోకి తీసుకురాగా.. కలెక్టర్ బీఎం సంతోష్ స్పందించారు. జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సూపరింటెండెంట్ మొదలుకొని మరికొందరు వైద్యులు విధి నిర్వహణలో

ఇష్టానుసారంగా విధులు..

జిల్లాలో 13 మండలాల్లోని ప్రజలకు గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి పెద్దదిక్కుగా కొనసాగుతూవస్తుంది. ఆస్పత్రిలో రోజుకు సుమారు 800లకు పైగా అవుట్‌పేషెంట్లు వివిధ రకాల వైద్యం నిమిత్తం వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆస్పత్రి కొందరు వైద్యుల కారణంగా మసకబారింది. సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్ వ్యవహారశైలి ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. పైగా అత్యవసర చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లకు సకాలంలో సరైన వైద్యం అందక మృతిచెందిన ఘటనలు కూడా ఉన్నాయి. దీనిపై గతంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన అప్పట్లో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది.

నిర్లక్ష్యం వహించటం గుర్తించడంతో 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాలు వాస్తవమేనని తేలింది. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించగా.. విధులకు డుమ్మా కొట్టిన మరికొందరు వైద్యులకు నోటీసులు జారీ చేయడంతో వైద్యులు హడలెత్తిపోతున్నారు.

సెలవుల్లో వెళ్లిన సూపరింటెండెంట్..

ఈ క్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ మొదలుకుని మరికొందరు వైద్యులు విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వ్యవహారాన్ని 'సాక్షి' దినపత్రిక క్షేత్రస్థాయిలో విజిట్ చేసి వరుస కథనాలు ప్రచురించింది. దీంతో బెంబేలెత్తిపోయిన సూపరింటెండెంట్ అకస్మాత్తుగా కలెక్టర్ బీఎం సంతోష్‌కు చెప్పాపెట్టకుండానే నెలరోజుల పాటు సెలవుల్లోకి వెళ్లాడు. ఈ వ్యవహారం కలెక్టర్‌ను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాల నేపథ్యంలో కలెక్టర్ బీఎం సంతోష్ జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు గంటకు పైగా ఆస్పత్రిలో కలియతిరుగుతూ పేషెంట్లకు అందించే వైద్యం మొదలుకుని రికార్డులు, ఫార్మసి విభాగం, విధులకు డుమ్మాకొడుతున్న వైద్యుల అటెండెన్స్(బయోమెట్రిక్) వివరాలు సేకరించారు. ఆ తర్వాత సెలవుల్లో ఉన్న డాక్టర్ కిశోర్ కుమార్‌ను సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి వెంటనే తొలగించారు. ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ నవీన్‌క్రాంతికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా ఆస్పత్రిలో అనధికారికంగా అర్హత లేని ప్రైవేటు వ్యక్తులను నియమించిన ఘటనపై కూడా విచారణకు ఆదేశించారు.

> **నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు..**
>
> 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనాల నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశాను. సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌తో పాటు మరో 16మంది వైద్యులు విధులకు గైర్హాజరు కావటం గుర్తించాం. సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి కిషోర్‌కుమార్‌ను తొలగిస్తూ.. బాధ్యతలు నవీన్‌క్రాంతికి అప్పగించాం. 16 మంది వైద్యులకు నోటీసులు ఇచ్చాం. అదేవిధంగా ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకున్న అవకతవకలపై సంబంధిత ఫార్మసిస్టును సస్పెండ్ చేశాం. దీనిపై విచారణ చేపట్టాం. అదేవిధంగా ఆస్పత్రిలో అనధికారికంగా జరిగిన నియామకాలపై విచారిస్తున్నాం. రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> – బీఎం సంతోష్, కలెక్టర్

ఫార్మాసిస్టుపై సస్పెన్షన్ వేటు..

అదేవిధంగా మరోవైపు ఫార్మసి విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వస్తున్న మందులు, ఇతర వైద్యపరికరాలు, సర్జికల్ మెటీరియల్ వాటికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. అయితే కోవిడ్ సమయంలో ఫార్మసీలో అవకతవకలు చోటుచేసుకున్న వైనాన్ని గుర్తించి, ఫార్మాసిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటస్వామిని సస్పెన్షన్ చేశారు. అయితే సస్పెన్షన్ వేటు నుంచి తప్పించుకునేందుకు సదరు ఫార్మాసిస్టు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు, సస్పెన్షన్ వేటు వేసిన విషయాన్ని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో కూడా కోవిడ్ సమయంలో పనిచేసిన సూపరింటెండెంట్ వ్యవహారంపై కూడా పూర్తిస్థాయి విచారణ చేపట్టినట్లు సమాచారం.



హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో కలెక్టర్ బి.ఎం.సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగు నీరు



ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద స్విచ్ ఆన్ చేసి కుడి కాల్వకు నీటి విడుదలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన లిఫ్టు–2 మార్లబీడు సమీపంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద కుడి కాల్వకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నీటి విడుదల ప్రారంభించారు. మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి కుడి కాల్వ హెడ్ రెగ్యులేటరీ వద్ద స్విచ్ ఆన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. అనంతరం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. అన్నదాతలు బాగుండాలని, ఒకప్పుడు నడిగడ్డ ప్రాంతం ఎడారిలా ఉండేదన్నారు. అలాంటి ప్రాంతం నేడు నెట్టెంపాడు జలాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందన్నారు. నెట్టెంపాడు జలాలతో గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లను నింపే ప్రక్రియను ప్రారంభించామన్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విడుదలకు కట్టుబడి ఉండడంతో పాటు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఎగువన భారీ వర్షాలు కురిశాయని, తద్వారా వచ్చే వరద జలాలతో రిజర్వాయర్లు నింపి సాగు నీరందిస్తామన్నారు. రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నెట్టెంపాడు జలాలతో రిజర్వాయర్లతో పాటు చెరువులు, కుంటలు నింపుతూ ఏటా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెండు పంటలకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. చివరి ఆయకట్టుకు సాగు నీరంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, డీఆర్ విజయ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సదర్శన్‌రెడ్డి, రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

అలాయ్.. బలాయ్



రాజశ్రీ గార్లపాడులో సవారీకి సిద్ధమైన పీర్లు

- ఘనంగా మొహర్రం

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లింలు అనే తేడా లేకుండా మతసామరస్యానికి ప్రతీకగా పండుగను జరుపుకొన్నారు. రాజశ్రీ గార్లపాడులోని మద్దెలబండ ఉశేన్‌షావ్ పీరును దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. అనంతరం కొబ్బరికాయలను కొట్టి, దట్టీలను, ముడుపులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా రాత్రి పానకం దుత్తలను అలాయి ఎదుట ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాయి గుంత ముందు పిల్లలు, పెద్దలు



ఆర్.గార్లపాడులో అలాయి ఆడుతున్న యువకులు, పెద్దలు

డప్పులతో అలాయి ఆడుతూ కేరింతలు కొట్టారు. రాత్రి పీర్ల సవారికి లేపి గ్రామంలోని పురవీధుల వెంట ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై రాత్రంతా జాగారం చేస్తూ.. సవారీలో పాల్గొన్నారు.

అధిక రుసుం వసూలు చేస్తే చర్యలు

ఎర్రవల్లిచౌరస్తా: మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుం కంటే అధిక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈడీఎం శివ సూచించారు. మంగళవారం ఎర్రవల్లి మండల పరిధిలోని మూడు మీ సేవా కేంద్రాలను ఆయన సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధరణిశ ఆధ్వర్యంలో మీ సేవ ఆపరేటర్లకు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. మీ సేవలో చేసే ప్రతి పేమెంట్‌ను క్యూఆర్ కోడ్ ద్వారా మాత్రమే చేయాలన్నారు. అలాగే ప్రతి అప్లికేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను తప్పనిసరిగా స్కానింగ్ చేయాలన్నారు. ధరణి రిజిస్ట్రేషన్‌లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం మీ సేవ కేంద్రాలకు వచ్చే వారికి తక్షణమే పనులు పూర్తి చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ శంషీర్, డీఎం సుధాకర్ రెడ్డి, వివిధ మీసేవ కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీఎం శివ

కొత్తకొత్తగా..

పాలమూరులో నూతన రిజర్వాయర్ల నిర్మాణం

- 'కొడంగల్' పథకంలో భాగంగా ప్రణాళికలు
- తొలి విడతలో 10 చెరువుల ఎంపిక పూర్తి
- ఎంజీకేఎల్ఐ పరిధిలోనూ మరిన్ని జలాశయాలు..
- ఉమ్మడి జిల్లాలో భారీగా పెరగనున్న ఆయకట్టు



రిజర్వాయర్‌గా మారనున్న ఊట్కూరు చెరువు

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్: పాలమూరు ప్రాజెక్టులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టింది. ప్రధానంగా ప్రతి ఎకరాకు సాగు నీరందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి కసరత్తు ప్రారంభమైంది. కొడంగల్–నారాయణపేట–మక్తల్ పథకంతో పాటు మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఆధారంగా కొత్త జలాశయాల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయకట్టు సాగు భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కొడంగల్ స్కీం.. తొలివిడతలో 10 జలాశయాలు

కొడంగల్–నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చి కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. గత ప్రభుత్వం ప్రధానంగా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపైనే దృష్టి సారించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించగా కొడంగల్ పథకంపై ఆశలు రేకెత్తాయి. ఆయన సైతం గతం నుంచి కొడంగల్ పథకంతోనే ప్రయోజనం ఉంటుందని వాదిస్తూ వచ్చారు. ఎప్పుడైతే ఆయన ముఖ్యమంత్రి అయ్యారో కొడంగల్–నారాయణపేట పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కొంత మార్పులు చేసి కొడంగల్, నారాయణపేటతో పాటు మక్తల్ నియోజకవర్గానికి మేలు జరిగేలా పలు మార్పులు చేశారు. అంతేకాదు ఈ పథకానికి సుమారు రూ.2,900 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కసరత్తు ప్రారంభం కాగా.. ఈ పథకంలో ఫేస్–1 కింద పది చెరువులను రిజర్వాయర్లుగా మార్చేలా ముందుకు సాగుతున్నారు.

కొడంగల్ స్కీంలో రిజర్వాయర్లుగా మారనున్న చెరువులు ఇవే..

- కొడంగల్ నియోజకవర్గంలో దౌల్తాబాద్, కొడంగల్, హస్నాబాద్, లక్ష్మీపూర్, బొంరాస్‌పేట, ఈర్లపల్లి చెరువులు.
- నారాయణపేట నియోజకవర్గంలో జాజాపూర్, జయమ్మ, కాన్‌కుర్తి చెరువులు.
- మక్తల్ నియోజకవర్గంలో ఊట్కూరు చెరువు.

ఎంజీకేఎల్ఐ పరిధిలో సైతం..

నియోజకవర్గానికో రిజర్వాయర్ నిర్మించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌పై నజర్ వేసింది. ఈ పథకం కింద ఇప్పటికే ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లు ఉన్నాయి. వీటి ద్వారా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ వనపర్తిలోని కొన్ని ప్రాంతాలకే నీరందుతోంది. తాజాగా కల్వకుర్తి స్కీం పరిధిలో మరిన్ని రిజర్వాయర్లు నిర్మించి ఆయకట్టు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అచ్చంపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్, జడ్చర్ల నియోజకవర్గాలకు సైతం సాగునీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నాలుగు నుంచి ఐదు టీఎంసీల చొప్పున రిజర్వాయర్ల నిర్మాణాలకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించగా.. ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనల రూపకల్పనలో నిమగ్నమయ్యారు.

> **త్వరలో టెండర్లు పిలుస్తారు..**
>
> కొడంగల్–నారాయణపేట–మక్తల్ స్కీంలో సుమారు 1.30 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు నారాయణపేట ప్రాంతానికి తాగు నీరందించాలన్నది లక్ష్యం. ఈ పథకంలో ముంపును తగ్గించడంతో పాటు ప్రతి ఎకరాకు నీరందించాలని సర్కారు సూచించింది. ఈ మేరకు రిజర్వాయర్లను అర టీఎంసీ నుంచి ఒకటిన్నర టీఎంసీల సామర్థ్యంతో మాత్రమే నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాం. ఇందుకు పది చెరువులను సైతం ఎంపిక చేశాం. త్వరలో ఈ పథకం పనులకు టెండర్లు పిలిచే అవకాశం ఉంది.
>
> – బ్రహ్మానంద్, ఇరిగేషన్ ఈఈ, నారాయణపేట



'పేట' మండలంలోని పేరపళ్ల జాయమ్మ చెరువు

ఎంపిక చేసిన చెరువుల కింద ప్రస్తుత, పెరగనున్న ఆయకట్టు (ఎకరాల్లో)..

చెరువు	ప్రస్తుత ఆయకట్టు	పెరిగే ఆయకట్టు
బొంరాస్‌పేట	660	3,156
కొడంగల్	478	5,596
హస్నాబాద్	946	7,226
దౌల్తాబాద్	665	11,136
కాన్‌కుర్తి	300	29,451
జయమ్మ	500	4,236
ఊట్కూరు	600	16,193

(వీటితోపాటు జాజాపూర్, లక్ష్మీపూర్, ఈర్లపల్లి చెరువులను రిజర్వాయర్లుగా మార్చి ఆయకట్టు పెంచేలా అధికారులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు.)

రాడార్ సర్వే సైతం పూర్తి..

కొడంగల్–నారాయణపేట–మక్తల్ స్కీంలో రిజర్వాయర్లుగా మార్చే చెరువులను అధికారులు ఇప్పటికే గుర్తించారు. కాన్‌కుర్తి మినహా మిగిలిన చెరువులు అన్ని 0.2 నుంచి 0.4 టీఎంసీల సామర్థ్యంతో ఉన్నవని అంచనాకు వచ్చారు. ఈ మేరకు వీటి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. పలు చెరువులకు ఎంతవరకు ఆయకట్టు పెరిగే అవకాశం ఉందో రాడార్ సర్వే ద్వారా లెక్కలేశారు. ఆయా చెరువులో నీటి లభ్యత, చుట్టూ ఉన్న భూమి, అటవీ ప్రాంతం ఎంత ఉంది వంటి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. కృష్ణా బేసిన్‌లో తెలంగాణ వాటాకు అనుగుణంగా.. ఉమ్మడి పాలమూరు ప్రజలకు మేలు జరిగేలా సాధ్యమైనంత నీటిని వినియోగించుకోవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుండడంపై ఉమ్మడి జిల్లా రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మొదటి పండుగ.. తొలి ఏకాదశి

శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన రోజు

- కార్తీకశుద్ధ ఏకాదశి వరకు చాతుర్మాస్య వ్రతాలు ఆచరించనున్న భక్తులు
- నేటి నుంచి ఆషాఢ మాసం ప్రారంభం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు


ఉమామహేశ్వరస్వామి ఆలయం

స్టేషన్ మహబూబ్‌నగర్/ అచ్చంపేట: ఆనందంతో పాటు ఆరోగ్యానిచ్చే పండుగ తొలి ఏకాదశి. మొదటి పండుగగా పిలిచే తొలి ఏకాదశికి హైందవ సంస్కృతిలో విశేష స్థానం ఉంది. దీన్ని శయన ఏకాదశి, హరివాసరం, పేలాల పండుగగా పిలుస్తారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. సూర్యోదయాన్నే శ్రీహరిని పూజిస్తారు. విష్ణుమూర్తి ప్రతిమను అలంకరించి, నైవేద్యం సమర్పిస్తారు. ఇక తొలి ఏకాదశిని రైతుల పండుగగా కూడా చెబుతారు. అతివృష్టి, అనవృష్టి ఏర్పడకుండా.. పంటలకు తెగుళ్లు ఆశించకుండా కాంక్షిస్తూ.. అన్నదాతలు తొలి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు చేస్తారు. కాగా, తొలి ఏకాదశి రోజు పేలాల పిండి తప్పక తినాలని పెద్దలు చెబుతారు. ఆరోగ్యపరంగానూ ఇది మంచిదని నమ్ముతారు.

మోక్షాన్ని ఇచ్చే మాసం..

ఆషాఢశుద్ధ తొలి ఏకాదశి హైందవులకు మహా పర్వదినం. దీన్ని శయనైకాదశి, ప్రథమ ఏకాదశి అని పిలుస్తారు. క్షీరాబ్ధిలో శేష పాన్పుపై శ్రీమహావిష్ణువు శయనించడం (యోగానిద్ర) వల్ల దీన్ని శయనైకాదశి అంటారు. ఏకాదశి రోజు శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనది. మోక్షాన్ని ఇచ్చే మాసం ఆషాఢం. ఈ రోజు నుంచి ఉత్తరం ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్టుగా కనిపిస్తాడు. బుధవారం నుంచి కార్తీకశుద్ధ ఏకాదశి వరకు 'చాతుర్మాస్య వ్రతాలు' ప్రారంభిస్తారు. ఏకాదశి 11 సంఖ్యకు సంకేతం. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనసు వెరసి పదకొండింటిపై నియంత్రణ కలిగి వ్రతం ఆచరించాలన్నది ఈ పండుగ సందేశం. ఈరోజు నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. రాబోయే శ్రావణ మాసంలో మహిళలు ఆచరించే వ్రతాలు, నోములు బాద్రపద మాసంలో వినాయక నవరాత్రులు, ఆ తర్వాత దేవీ నవరాత్రులు, దసరా, దీపావళి ఇలా ఎన్నో పండుగలకు ఈ చాతుర్మాస్యం ప్రత్యేకం.

24 గంటలపాటు భజన కార్యక్రమాలు..

తొలి ఏకాదశి రోజున ఆలయాల్లో ఎక్కాహం, అభిషేకాలు చేపడతారు. ఎక్కాహం అంటే 24 గంటల పాటు ఆలయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం ఎప్పుడైతే ప్రారంభిస్తారో మరునాడు అదే సమయం వరకు నిరంతరం భక్తి భజనలతో పూజా కార్యక్రమాలు జరుపుతారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

తొలి ఏకాదశి పూజలకు నల్లమలలోని ప్రసిద్ధ ఆలయాలు సిద్ధమయ్యాయి. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. అలాగే సోమశిల శ్రీలలితాసోమేశ్వర ఆలయం, నల్లమలలోని లొద్ది మల్లయ్య, అంతర్‌గంగా ఆలయాల్లోనూ వేడుకలు నిర్వహించనున్నారు. ఉమామహేశ్వర కొండపైకి ఆర్టీసీ బస్సులు మినహా కార్లు, ఆటోలు, బైక్‌లను అనుమతించడం లేదు.

- మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి రోడ్డు కాటన్‌మిల్లు శ్రీవేంకటేశ్వర స్వామి, సింహగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా రేణుకా ఎల్లమ్మ, పాత శివాలయం, బండ్లగేరి శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రకృతిలో మార్పులకు సంకేతం..



ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతం తొలి ఏకాదశి. సూర్య భగవానుడు ఈరోజు నుంచి దక్షిణాయనం వైపునకు మరలుతాడు. హిందువులు తొలి ఏకాదశిని మొదటి పండుగగా నిర్వహించుకుంటారు. ఈ రోజు ఉపవాసం, జాగరణ చేస్తారు. రైతులకు కూడా ప్రత్యేకమైన రోజు.

– వీరయ్యశాస్త్రి, అర్చకుడు, ఉమామహేశ్వర దేవస్థానం

పండుగలకు ప్రారంభ సూచిక..



రాబోయే పండుగలకు ప్రారంభ సూచిక తొలి ఏకాదశి. ఈ పర్వదినానికి ఎంతో విశిష్టత ఉంటుంది. చాతుర్మాస్యం దేవతా పూజలకు నిలయమైనది. ఏకాదశి రోజు విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణం అత్యంత పుణ్యప్రదమైనది.

– తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, శ్రీవేంకటేశ్వరస్వామి సేవా మండలి అధ్యక్షుడు

చాతుర్మాస్య దీక్ష ప్రారంభం..



తొలి ఏకాదశి రోజు నుంచే చాతుర్మాస్య దీక్ష ప్రారంభమవుతుంది. ఈ చాతుర్మాస్యంలో ఒక్కో నెల ఒక వ్రతాచరణ ఉంటుంది. తొలి ఏకాదశి రోజు భగవంతుడి నామస్మరణ పూజలు, ఉపవాసం చేయడం వల్ల ఏడాదిలో వచ్చే 24 ఏకాదశలు ఆచరిస్తే వచ్చే ఫలితం లభిస్తుంది.

– జోషి సంతోషాచార్య, శ్రీపరశురామ బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య స్వామి హోమం


యాగంలో పాల్గొన్న దంపతులు

నాగర్‌కర్నూల్: సుబ్రహ్మణ్య స్వామి ఆరాధనతో నేత్ర, చర్మవ్యాధులు తగ్గుతాయని, వివాహ, సంతాన, ఆయు, ఐశ్వర్య భాగ్యాలు కలుగుతాయని అర్చకులు వివరించారు. ఈ మేరకు మంగళవారం పలువురిచే సర్పసూక్త సహిత సంతాన గోపాల, మన్యుసూక్త, సుబ్రహ్మణ్య స్వామి హోమం సామూహికంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహింపజేశారు. ఈనెల 7 నుంచి 21 వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం, ఆయుత చండీ, అతి రుద్రం, శ్రీ సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం, 83వ విశ్వశాంతి మహాయాగ ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమం చేపట్టారు. ఉదయం గోపూజ, యాగశాల ప్రదక్షిణ మొదలు అత్యంత వైభవంగా వేద, చండీ, రుద్ర, రామాయణ, భాగవత, సుందరకాండ, చతుర్వేద హోమాలను నిర్వహించినట్లు కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వివరించారు. సంతాన ప్రాప్తికి సంబంధించి పుత్ర కామేష్టి హోమాలు చేయించినట్లు తెలిపారు. సాయంత్రం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు వివరించారు. మూడు వందల మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించినట్లు పేర్కొన్నారు. 9వేల మంది పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశామన్నారు. 17న చండీ సహిత శ్రీరుద్ర హోమాలు, ఉమామహేశ్వర కల్యాణ మహోత్సవం ఉంటుదని వివరించారు.


గోపూజలో పాల్గొన్న భక్తులు

ఆల్మట్టికి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జూరాలకు 1,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూర్/ మదనాపురం/ దోమలపెంట: ఎగువన కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద భారీగా పెరుగుతోంది. ఉదయం నుంచి క్రమంగా వరద పెరుగుతుండటంతో రాత్రి 9.30 గంటల వరకు ఆల్మటి ప్రాజెక్టుకు 1.27 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ వరద ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దీంతో ఆల్మట్టి నుంచి దిగువకు 65 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 97.554 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.31 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 23.787 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 20,994 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 90 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆల్మట్టి వద్ద విడుదల చేసిన 65 వేల క్యూసెక్కుల వరద బుధవారం ఉదయం 7 గంటలకు నారాయణపూర్ ప్రాజెక్టుకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

- ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం ఎగువ నుంచి 1,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో నెట్టెంపాడు పంపు ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 110, భీమా లిఫ్టు-1కు 151, ఎడమ కాల్వకు 390, భీమా లిఫ్టు-2కు 847 క్యూసెక్కులు కలిపి మొత్తం 2,401 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.682 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

రామన్‌పాదులో 1,019 అడుగులు

రామన్‌పాదు జలాశయంలో నీటిమట్టం నిలకడగా ఉంది. జూరాల సమాంతర, ఎడమ కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. మంగళవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 350 క్యూసెక్కులు, వివిధ లిఫ్టుల ద్వారా 847, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో విద్యుదుత్పత్తి ప్రారంభం

శ్రీశైలం జల విద్యుత్ కేంద్రాల్లో మంగళవారం సాయంత్రం నుంచి విద్యుదుత్పత్తి చేపట్టినట్లు జలాశయం గేజింగ్ నిర్వహణ అధికారులు తెలిపారు. టీఎస్ జెన్‌కో పరిధిలోని భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 12,713 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 15,549 క్యూసెక్కులు కలిపి 32,262 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదిలారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 812.3 అడుగుల వద్ద 35.6294 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,352 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. జలాశయంలో 64 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. స్థానికంగా 4.20 మి.మీ., వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవాబుపేట: మండల పరిధిలోని రుద్రారం సమీపంలో గద్దగుండు వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి మంగళవారం ఆర్టీసీ బస్సు వెళ్తుంది. అదే సమయంలో యాదగిరి(24) జిల్లా కేంద్రం నుంచి నవాబుపేటకు స్కూటీపై వెళ్తుండగా.. రుద్రారం సమీపంలో గద్దగుండు వద్ద బస్సు ఢీ కొట్టింది. దీంతో యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం అతడిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలియజేశారు.

50 నిమిషాలు రోడ్డుపైనే..

బస్సు ప్రమాదం జరిగిన 50 నిమిషాల పాటు ప్రమాదంలో గాయపడిన యువకుడు రోడ్డుపై ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. ఎవరూ అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయలేదు. 108 వాహనానికి సమాచారం ఇచ్చి, అది వచ్చే వరకు ఎవరూ అతడిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయలేదు. 108 వాహనవ వచ్చిన తర్వాత బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మృతిచెందాడు. ఈ విషయంలో మృతుడి సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలియజేశారు.

చోరీ కేసులో ముగ్గురి రిమాండ్

లింగాల: మండల కేంద్రంలో ఈ నెల 11న జరిగిన చోరీ కేసులో మండల కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. చిన్నరాములు అనే వ్యాపారి ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారని ఎస్ఐ తెలిపారు. ఈ చోరీలో అజయ్‌తో పాటు ధనుంజయ, లింగస్వామి నేరాన్ని ఒప్పుకొన్నారని తెలిపారు. 10వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో అనుమానాస్పదంగా రోడ్లపై తిరుగుతున్న వ్యక్తులను సీసీ కెమెరాల ఆధారంగా అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించారని తెలిపారు. అజయ్ అనే వ్యక్తి లీడర్‌గా వ్యవహరించాడని, చోరీ చేసిన సొమ్మును మిగతా ఇద్దరు అతడికి ఇచ్చారని తెలిపారు. ముగ్గురిని అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఎస్ఐ తెలియజేశారు.

గొంతులో మటన్ బొక్క ఇరుక్కొని వ్యక్తి మృతి


రాజు (ఫైల్)

తెలకపల్లి: గొంతులో మటన్ బొక్క ఇరుక్కొని ఓ వ్యక్తి ఊపిరాడక మృతిచెందాడు. వివరాలిలా.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లికి చెందిన కోనిగారి రాజు(38) మంగళవారం ఉదయం అన్నంలో మటన్ తింటుండగా ఓ బొక్క గొంతులో ఇరుక్కుంది. ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురవడంతో వెంటనే కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో రూ.36 లక్షలు మాయం

- జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో గుర్తించిన బాధితుడు
- డబ్బు తరలింపుపై పలు అనుమానాలు
- కేసు నమోదు.. ముమ్మర దర్యాప్తు


బ్యాగులో మిగిలిన రూ.2 లక్షల నగదును పరిశీలిస్తున్న సీఐ, పక్కన బాధితుడు దామోదర్

జడ్చర్ల: టీఎస్‌ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడి బ్యాగులో ఉంచిన రూ.36 లక్షల నగదు మాయమైన సంఘటన మంగళవారం జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో కలకలం రేపింది. బాధితుడు దామోదర్ కథనం ప్రకారం.. దామోదర్ హైదరాబాద్‌లోని బేగంపేటలో నివాసం ఉంటూ అక్కడే ట్రాన్స్‌కోలో ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల తన ఉద్యోగానికి సంబంధించిన జీపీఎఫ్, పీఎఫ్ ఖాతాలో దాచుకున్న రూ.38 లక్షలను విడతల వారీగా బ్యాంకు నుంచి డ్రా చేశాడు. కర్నూలులో ఉంటున్న తన సోదరికి డబ్బును ఇచ్చేందుకు మంగళవారం ఉదయం 7.45 గంటలకు ఎంజీబీఎస్‌లో పికెట్ డిపోకు చెందిన కడప వెళ్తున్న బస్సు ఎక్కాడు. తన బ్యాగులో పైవరుసలో బయటకు కనిపించని ఒక పెద్ద కవర్‌లో రూ.36 లక్షలు, మరో చిన్నకవర్‌లో రూ.2 లక్షలు ప్యాక్ చేసి బ్యాగులో పెట్టుకున్నాడు. అయితే జడ్చర్ల కొత్తబస్టాండ్‌కు బస్సు చేరుకున్న సమయంలో బస్సు డ్రైవర్ టిఫిన్ చేసేందుకు 10 నిమిషాలు సమయం ఉంటుందని ప్రయాణికులకు చెప్పడంతో బాధితుడు దామోదర్ టిఫిన్ చేసేందుకు స్టాండ్‌లోని తన బ్యాగును చేతిలోకి తీసుకున్నాడు. బ్యాగు బరువు తగ్గి తేడాగా అనిపించడంతో వెంటనే తెరచి చూడగా అందులో ఉంచిన రూ.36 లక్షల కవర్ కనిపించలేదు. వాటి స్థానంలో నాలుగు అర లీటర్ వాటర్ బాటిళ్లు ఉన్నాయి. దీంతో వెంటనే బస్సు డ్రైవర్‌కు సమాచారం ఇచ్చి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బస్సును తరలించారు. అక్కడ పోలీసులు ప్రయాణికులను, బస్సును తనిఖీ చేశారు. అయితే బ్యాగులో అడుగు బాగాన ఉంచిన మరో చిన్న కవర్‌లోని రూ.2 లక్షల నగదు ఉందని బాధితుడు తెలిపాడు. దీంతో రూ.2 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పలు అనుమనాలు..

డబ్బు తరలింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడు అంత డబ్బు ఉన్న బ్యాగును తన దగ్గరే పెట్టుకునే అవకాశం ఉన్నా.. నిర్లక్ష్యంగా పైన పెట్టడం ఏమిటని.. వాస్తవంగా అంత డబ్బు తీసుకొచ్చాడా.. లేదా అనే కోణంలో కూడా విచారిస్తున్నారు. పెద్ద మొత్తంలో డబ్బు తీసుకెళ్తున్నప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేగాక ఉన్నత ఉద్యోగి కావడంతో కారులో తీసుకెళ్లే ఆలోచన ఎందుకు చేయలేదని, సహాయకుడు లేకుండా వెళ్లడం ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాగులోని డబ్బు ఉన్న విషయం దొంగలకు ఎలా తెలిసింది.. ఎవరైనా దగ్గరి వారు దొంగలకు సమాచారం ఇచ్చారా.. పక్కా స్కెచ్ వేసి అపహరించారా అనే అనుమానాలు ఉన్నాయి. స్టాండ్‌లోని బ్యాగును వెనక్కి తీసుకుని అందులోని డబ్బు కవర్‌ను కొట్టేసి, వాటి స్థానంలో వాటర్ బాటిళ్లు పెడుతుండగా పక్కనే ఉన్న ప్రయాణికులు గమనించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే బాధితుడు దామోదర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

బస్సు ఎక్కుతుండగా రూ. 50వేలు చోరీ

జడ్చర్ల: స్థానిక కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి నుంచి రూ. 50వేలు అపహరించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్ పనిచేస్తున్న శ్రీకాంత్ విధులు ముగించుకొని తన మిత్రుడి కారులో జడ్చర్ల కొత్త బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా.. ప్యాంట్ జేబులో ఉన్న రూ. 50 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ప్రయాణికుల రద్దీ కారణంగా అతడు గుర్తించలేదు. బస్సు ఎక్కిన తర్వాత జేబులో చూసుకోగా.. రూ.50 వేల నగదు కనిపించలేదు. కొత్త బస్టాండ్‌లో మంగళవారం ఉదయం రూ. 36 లక్షల చోరీ జరిగిన నేపథ్యంలో సాయంత్రం మరో ప్రయాణికుడి జేబులో నుంచి రూ.50 వేలు చోరీ కావడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బస్టాండ్‌లో పోలీసుల గస్తీ పెంచి, భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, చోరీలపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

పాములతో పర్యావరణ సమతుల్యత


పాముల గురించి వివరిస్తున్న సదాశివయ్య

జడ్చర్ల టౌన్: పర్యావరణ సమతుల్యతలో పాములది ప్రముఖ పాత్ర అని గుర్తించాలని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా. సదాశివయ్య సూచించారు. మంగళవారం ప్రపంచ పాముల దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని ఉదయ మెమోరియల్ హైస్కూల్, సన్‌రైజ్‌స్కూల్‌లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పాములపై అవగాహన కల్పించారు. పర్యావరణలో పాముల పాత్ర అమోఘమైనదని, ఆహారపు వలలో తగిన పాత్ర పోషిస్తాయన్నారు. పురణేతి హాసాలలోనూ వాటి ప్రస్తావన ఉందన్నారు. అంతటి ప్రాశస్త్యమైన పాములను మానవులు నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాములలో విషసహిత, విషరహిత అర్ధవిష సర్పాలు ఉన్నాయని వాటి లక్షణాలు, కాటేస్తే వచ్చే లక్షణాలు, ప్రథమ చికిత్స అంశాలపై వివరించారు. విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యక్షంగా పాములను చూపించి విద్యార్థులతో భయాన్ని పోగొట్టారు. విచక్షణారహితంగా పాములను చంపితే వచ్చే పర్యవసానాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ రాహుల్, పాఠశాలల కరస్పాండెంట్‌లు వీణాశివకుమార్, ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- పోలీసులకు ఫిర్యాదు


తవ్వకాలు జరిపిన ఆలయంలోని కల్యాణ మండపం

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలం కొండనాగుల సమీపంలోని పెద్దగుడిబండ శ్రీరామలింగేశ్వరాలయం గుప్తనిధుల వేటకు అడ్డగా మారింది. గుర్తు తెలియని వ్యక్తులు నిధుల కోసం తరచూ ఇక్కడ తవ్వకాలు చేపడుతున్నారు. ఇరవై ఏళ్ల వ్యవధిలో సుమారు 12 సార్లు ఘటనలు చోటు చేసుకున్నా ఇప్పటి వరకు పోలీసులు నిందితులను గుర్తించిన దాఖలాలు లేవు. తాజాగా సోమవారం రాత్రి సైతం మరోసారి తవ్వకాల ఘటన చోటుచేసుకుంది. ఆలయంలోని గర్భగుడి ఎదురుగా ఉన్న కల్యాణ మండపం కింద ఉన్న బండరాళ్లను ధ్వంసం చేసిన దుండగులు మట్టిని తవ్వి నిధులు తీసుకెళ్లారు. మంగళవారం ఉదయం గుడికి వెళ్లిన పూజారి నిమ్మల రాజు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతయ్య మంగళవారం బల్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అచ్చంపేట సీఐ రవీందర్ క్లూస్ టీం సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా పోలీసుల వైఫల్యంతోనే తరుచూ ఘటనలు పునరావృతం అవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితం కూడా ఘటన చోటు చేసుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. దీంతో తాజాగా మరోసారి దుండగులు తవ్వకాలకు పాల్పడ్డారని అంటున్నారు. ఘటనపై కేసునమోదు చేసి సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రేణయ్య తెలిపారు. నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్ట్ చేస్తామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో.. తల్లిదండ్రుల చెంతకు


తిమ్మప్పను తండ్రి రాములుకు అప్పగిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలన్యూటౌన్: మతిస్థిమితం కోల్పోయి బంగ్లాదేశ్ సరిహద్దుకు చేరిన ఓ యువకుడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం చెన్నారెడ్డిపల్లికి చెందిన రాములుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడైన తిమ్మప్ప మతిస్థిమితం కోల్పోయి రెండేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. దీంతో తల్లిదండ్రులు నిత్యం బాధపడేవారు. అయితే రెండు నెలల క్రితం పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మాల్దా జిల్లా రోడ్లపై, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో తిమ్మప్ప తిరుగుతూ, అక్కడి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తారాశంకర్‌కు కనిపించాడు. తిమ్మప్పను ఆయన చేరదీసి రెండు నెలలపాటు యోగక్షేమాలు చూసుకున్నాడు. ఈక్రమంలో తిమ్మప్ప వివరాలు తెలుసున్నాడు. అతడు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేరు చెప్పడంతో పూర్తి వివరాలు సేకరించి, ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేశాడు. వెంటనే తిమ్మప్ప తల్లిదండ్రులకు ఎమ్మెల్యే సమాచారం అందించడంతో పాటు తన స్వంత ఖర్చుతో విమానంలో తారాశంకర్‌తో కలిసి తిమ్మప్పను మంగళవారం రప్పించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిమ్మప్పను తల్లిదండ్రులకు అప్పగించారు. రెండేళ్ల తర్వాత కుమారుడు తిరిగి రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేశారు. తన కుమారుడిని రప్పించేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తిమ్మప్ప తండ్రి రాములు అన్నారు. కాగా మతిస్థిమితం కోల్పోయిన తిమ్మప్పను చేరదీసి, యోగక్షేమాలు చూసుకున్న తారాశంకర్‌ను ఎమ్మెల్యే సత్కరించారు. తిమ్మప్పకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు.

కాల్వ షెట్టర్ ధ్వంసం

మల్దకల్: మండలంలోని కుర్తిరావల్‌చెర్వు గ్రామ సమీపంలో కాల్వకు ఉన్న షెట్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ధ్వంసం చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారి సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. ర్యాలంపాడు నుంచి ఇటిక్యాలకు వెళ్లే 108 ప్యాకేజీలోని ప్రధాన కాల్వకు ఏర్పాటు చేసిన షెట్టర్‌ను ధ్వంసం చేయడంతో కాల్వకు వచ్చే నీరు ముందుకు వెళ్లకుండా మధ్యలోనే నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు మళ్లించేందుకు ఈ చర్యకు పాల్పడి ఉంటారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలియజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ. 2లక్షల ఆస్తినష్టం


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

దేవరకద్ర: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దేవరకద్ర తెలుగువాడకు చెందిన వాకిటి కొండన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. ఇంటికి తాళం వేయడంవల్ల ఎవరూ గమనించలేదు. దీంతో ఇంట్లో ఉన్న ఫ్రిజ్, టీవీ, బీరువాలు ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ. 2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దగ్ధమైన ఇంటిని పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు. బాధితుడికి కొంత ఆర్థికసాయం అందించి, ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, నాయకులు అంజిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, జవహర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భూవివాదంలో కుటుంబంపై దాడి

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని చందుబట్లలో మంగళవారం భూ వివాదంలో భార్యాభర్తలపై దాడి చేసి, గాయపర్చిన సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండకింది సుదర్శన్‌రెడ్డి, కళావతమ్మ, వారి కుమారుడు మల్లారెడ్డి, మాధవరెడ్డిపై అదే గ్రామానికి చెందిన పక్క పొలం వ్యక్తులు దాడి చేసి గాయపర్చారు. గాయపడిన బాధితులను గ్రామస్తులు నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. బాధితులను రెడ్డిసేవా సమితి జిల్లా అధ్యక్షుడు దొడ్ల నారాయణరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దాడి చేసి గాయపర్చిన వారిని పోలీసులు శిక్షించాలని డిమాండ్ చేశారు.